నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 15 అక్టోబర్ 2024 | KAMAREDDY



నిజామాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

# బస్సుల్లేవ్..

- బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు
- పండుగ రద్దీ వేళ ఆర్టీసీ వైఫల్యం
- గంటల తరబడి బస్సులు రాని వైనం
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- రెట్టింపు వసూలు చేసిన డ్రైవర్లు



బిచ్కుంద బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు





**సీటు కోసం పోరాటం..**
నిజామాబాద్ బస్టాండ్‌లో సీటు కోసం కిటికీలో నుంచి బస్సులోకి బాలుడిని తోస్తున్న ప్రయాణికుడు, సీటు కోసం తిప్పలు పడుతున్న వృద్ధుడు

బిచ్కుంద, అక్టోబర్ 14: పండుగకు సొంతూళ్లకు చేరుకున్న ప్రజలకు తిరిగి వెళ్లే క్రమంలో ఆర్టీసీ చుక్కలు చూపింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపడంలో రవాణా సంస్థ పూర్తిగా విఫలమైంది. బస్సులు రాక ప్రయాణికులు పొద్దంతా బస్టాండ్లలో పడిగాపులు కాయాల్సిన దుస్థితినెలకొంది. కొందరేమో ఆర్టీసీ తీరును తిట్టుకుంటూ ఇండ్లకు వెళ్లిపోగా, మరికొందరేమో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. మరోవైపు, ప్రయాణికుల అవసరాన్ని ప్రైవేట్ వాహనాలు సొమ్ము చేసుకున్నాయి.

**బస్టాండ్లలో రద్దీ..**

వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా బతుకమ్మ, దసరా సెలవుల సందర్భంగా సొంతూళ్లకు చేరారు. ఇంటిల్లి పాదితో కలిసి ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకున్నారు. సెలవులు ముగియడంతో తిరిగి వెళ్లేందుకు సోమవారం ఉదయమే ముల్లెమూటతో బస్టాండ్లకు చేరుకున్నారు. తొందరగా వెళ్లి విధుల్లో నిమగ్నం కావొచ్చనుకున్న వారికి ఆర్టీసీ ఊహించని షాక్ ఇచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపడలేక చేతులెత్తేసింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నా ఒక్క బస్సు రాకపోవడంతో అసహనానికి లోనయ్యారు. బిచ్కుంద బస్టాండ్‌కు వచ్చిన వారి ఓపికకు ఆర్టీసీ పరీక్ష పెట్టింది. సాధారణ రోజుల్లో హైదరాబాద్, సంగారెడ్డి రూట్‌లో అరగంటకు ఒక బస్సు తిరిగేది. కానీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒక్క బస్సు కూడా రాలేదు.

## సీటు కోసం అవస్థలు.. పగిలిన బస్సు అద్దాలు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 14: దసరా పండుగ అయిపోవడంతో బస్టాండ్లన్నీ ప్రయాణికులతో రద్దీగా మారాయి. అయితే, బస్సులు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ తదితర బస్టాండ్లు సోమవారం తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. అర గంట, గంటకొకటి చొప్పున వచ్చే అరకొర బస్సుల వెంట జనం పరుగులు తీశారు. ఈ క్రమంలో బస్సులో సీటు ఏమో కానీ కనీసం కాస్త చోటు దొరికినా గమ్యస్థానానికి చేరుకోవచ్చన్న భావన ప్రయాణికుల్లో కనిపించింది. నిజామాబాద్ బస్టాండ్‌లో రద్దీ కారణంగా ఓ ప్రయాణికుడు సీటు కోసం బస్సు కిటికీ లోంచి లోపలికి బ్యాగు వేసే క్రమంలో అద్దం పగిలి పోయింది. దీంతో డ్రైవర్‌కు, ప్రయాణికుడికి వాగ్వాదం జరుగగా, ఆర్టీసీ అధికారి స్వరూపరాణి వచ్చి సర్దిచెప్పారు. సరిపడా బస్సులు వేస్తే ఇలాంటి పరిస్థితులు రావు కదా అని తోటి ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందిని నిలదీశారు.



### ‘ప్రైవేట్’ దోపిడీ

ఆర్టీసీ వైఫల్యాన్ని ప్రైవేట్ వాహనాలు సొమ్ము చేసుకున్నాయి. ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని దండుకున్నాయి. ఆర్టీసీ బస్సులు లేక, బస్టాండ్లలో పడిగాపులు కాయలేక కొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఇదే అదనుగా వారు టికెట్‌పై రెండింతల చార్జీలు అదనంగా వసూలు చేశారు. తప్పనిసరై వెళ్లాల్సి రావడంతో అదనపు భారం మోయక తప్పలేదు. హైదరాబాద్ మార్గంలో కిక్కిరిసిన ప్రయాణికులతో ప్రైవేట్ వాహనాలు దూసుకెళ్లాయి.

### మూడు గంటలైనా బస్సు రాలే..



దసరా సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చా. సంగారెడ్డికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చా. మూడు గంటలై పోయింది. ఒక్క బస్సు కూడా రాలేదు. ప్రైవేట్ వాహనంలో వెళ్దామంటే రూ.300 దాకా అడుగుతున్నారు.

**- వైష్ణవి, విద్యార్థిని, బిచ్కుంద**

### ఒక్క బస్సూ లేదు..



నేను హైదరాబాద్‌లో జాబ్ చేస్తా. దసరా పండుగకు ఇంటికి వచ్చా. తిరిగి వెళ్లేందుకు ఉదయమే బస్టాండ్‌కు చేరుకున్నా. 10 గంటల నుంచి వేచి చూస్తున్నా. మధ్యాహ్నం ఒంటిగంట దాటినా ఒక్క బస్సు కూడా రాలే. బాన్సువాడ మీదుగా వెళ్దామన్నా అటువైపు వెళ్లే బస్సులు కూడా రాలేదు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్దామంటే టికెట్ కంటే రెండింతలు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు.

**- రాజు, బాబుల్‌గావ్ గ్రామం**

### జీపులోల్లు ఎక్కువ అడుగుతుండ్రు..



బతుకుదెరువు కోసం హైదరబాద్‌కు పోయినం. పండుక్కని మా సొంతూరు సిరిసముందర్‌కు అచ్చినం. ఇప్పుడు తిరిగి హైదరాబాద్ పోవాలె. పొద్దుగల్లనే బస్టాండ్‌కు అచ్చినం. రొండు గంటల సంది బస్సులే రాలే. జీపులల్ల పోదామంటే ఐదొందలు అడుగుతుండ్రు. ఏం జేయాల్నో సమజైత లేదు.

**- సావిత్రి, సిర్‌సముందర్ గ్రామం**

## కొనుగోలు కేంద్రం.. ప్రారంభానికే పరిమితం

- సోయా కొనుగోళ్లు చేయరట
- మండిపడుతున్న రైతాంగం

మోర్తాడ్, అక్టోబర్ 14: సోయా కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభిస్తున్నారు. కానీ కొనుగోళ్లు మాత్రం చేయడం లేదు. ఇదేమంటే కేంద్రం ప్రారంభానికే పరిమితమని అధికారులు చెబుతుండడంతో రైతులు బిత్తరపోతున్నారు. అసలేం జరిగిందంటే.. సోయా కొనుగోళ్లు చేస్తామని చెబుతూ ఇటీవల కమ్మర్‌పల్లిలో కేంద్రాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. సోమవారం నుంచి కొనుగోళ్లు చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. దీంతో రైతులు సోమవారం సొసైటీ ఆవరణలో పాస్‌బుక్ జిరాక్సులను లైన్‌లో ఉంచారు. మధ్యాహ్నం వరకు వేచి చూసినా ఒక్కరూ రాలేదు. కనీసం సమాధానం చెప్పే వారు కూడా లేకపోవడంతో రైతులు ఆగ్రహానికి లోనయ్యారు. అప్పటికే ఓపిక నశించిన అన్నదాతలు.. ఏం జరిగిందో తెలుసుకుందామని వ్యవసాయ విస్తరణ అధికారి వద్దకు వెళ్లారు. స్థానికంగా గోదాము సౌకర్యాలు లేనందున కొనుగోళ్లు చేయమని, వేల్పూర్ మార్కెట్ కమిటీ వద్దే కాంటాలు వేస్తామని ఆయన సెలవిచ్చారు. అప్పటికే పూర్తిగా ఓపిక నశించిన రైతులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఈపాటి దానికి కొనుగోలు కేంద్రం ఎందుకు ప్రారంభించారు.. ఎందుకింత ఆర్భాటం చేశారని మండిపడ్డారు.

## ఏసీపీ ఆఫీసు ఎదుట ధర్నా



ఆర్మూర్ ఏసీపీ కార్యాలయం ఎదుట దుర్గామాత విగ్రహంతో నిరసన తెలుపుతున్న మాలధారులు, యువకులు

- దుర్గామాత విగ్రహంతో బైఠాయింపు
- సౌండ్‌సిస్టమ్‌ను తీసుకెళ్లడంపై ఆగ్రహం
- ఏసీపీ, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు
- కాంగ్రెస్‌కు తొత్తులుగా మారారని మండిపాటు
- దిగొచ్చిన పోలీసులు.. సౌండ్ సిస్టమ్ వెనక్కి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 14 : ఆర్మూర్ ఏసీపీ కార్యాలయం ఎదుట సోమవారం ఉద్రిక్తత నెలకొంది. హిందూ సంఘాలు, బీజేపీ నేతలు దుర్గామాత విగ్రహంతో ఆఫీసు ముందర బైఠాయించారు. దేవీ శోభాయాత్ర సందర్భంగా నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకున్న సౌండ్‌సిస్టమ్‌ను పోలీసులు తీసుకెళ్లడంతో భక్తులు ఆందోళనకు దిగారు. జిల్లాలో డీజేలను నిషేధిస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఆర్మూర్‌లోని త్రిపుర యూత్ క్లబ్ సభ్యులు దుర్గామాత శోభాయాత్ర సందర్భంగా నిబంధనల మేరకు సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే, దాన్ని కనీసం ప్రారంభించక ముందే పోలీసులు వచ్చి సౌండ్ సిస్టమ్‌ను తీసుకెళ్లారు. దీంతో యూత్ సభ్యులు, బీజేపీ నాయకులు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకున్న సౌండ్ సిస్టమ్‌ను తిరిగి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని అడిగి తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పడంతో భక్తులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. నిమజ్జనానికి తీసుకెళ్తున్న దుర్గామాత విగ్రహాన్ని ఏసీపీ ఆఫీసు వద్దకు తీసుకొచ్చి బైఠాయించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు వచ్చి నచ్చజెప్పేందుకు యత్నించగా, సౌండ్ సిస్టమ్‌ను తిరిగి ఇచ్చేదాకా ఆందోళన విరమించబోమని యువకులు స్పష్టం చేశారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని ట్రాన్స్‌ఫర్ చేయాలని, పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేశారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా పని చేస్తున్నారని మండిపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో దిగి వచ్చిన పోలీసులు.. చివరకు సౌండ్ సిస్టమ్‌ను అప్పగించారు. దీంతో యూత్ సభ్యులు ఆందోళన విరమించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఆర్మూర్ పోలీసులు అతిగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకున్నా సౌండ్ సిస్టమ్‌లను సీజ్ చేసి తీసుకెళ్లడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రూ.10 వేల పింఛన్ ఇవ్వాలి

- ఎమ్మెల్యే వేములకు కిడ్నీ బాధితుల విజ్ఞప్తి



ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మోర్తాడ్, అక్టోబర్ 14: కిడ్నీ సమస్యలతో బాధ పడుతున్న తమకు నెలకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా అసెంబ్లీలో తమ గురించి ప్రస్తావించాలని బాధితులు.. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు చెందిన బాధితులు వేల్పూర్‌లో సోమవారం ఎమ్మెల్యే వేములను కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కిడ్నీ బాధితులమంతా కలిసి ప్రజాభవన్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించామని, అయినా ఎలాంటి స్పందనలేదని వేముల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేలను కలిసి తమ గోడు వెల్లబోసుకుంటున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవోఎంఎస్ 43 ద్వారా కిడ్నీ బాధితులకు ప్రతినెలా రూ.10 వేల పింఛన్ ఇస్తున్నదని, అదే విధంగా తెలంగాణలోనూ ఇవ్వాలని కోరారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అయిన వారు, కిడ్నీ సమస్యలు ఉన్న వారు పని చేసే పరిస్థితి ఉందని, డయాలసిస్ కోసం ప్రతినెలా దవాఖానల చుట్టూ తిరగాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ప్రశాంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



దసరా పండుగ సందర్భంగా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని కేసీఆర్ స్వగృహంలో కలిసి జమ్మి (బంగారం) అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. – ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 14



అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

## వెలవెలబోయిన ‘ప్రజావాణి’

కంఠేశ్వర్, అక్టోబర్ 14 : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈ వారం అధికారులు డుమ్మా కొట్టడంతో కళ తప్పింది. దసరా తర్వాత నిర్వహించిన ఈ కార్యక్రమానికి చాలా మంది అధికారులు హాజరు కాలేదు. దీంతో ప్రజావాణి బోసిపోయింది. ఈ వారం 51 ఫిర్యాదులు రాగా, త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మకరంద్ ఆదేశించారు.

## డిగ్రీ కళాశాలలు బంద్

- నిరవధిక సమ్మెకు దిగిన యాజమాన్యాలు
- ఉమ్మడి జిల్లాలో 54 కాలేజీలు..
- 30 వేలకు పైగా విద్యార్థులు..

ఖలీల్‌వాడి/బోధన్, అక్టోబర్ 14: ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు మూతబడ్డాయి. ఆయా కళాశాలల యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలనే డిమాండ్‌తో బంద్ పాటిస్తున్నాయి. దీంతో తొలి రోజు ఉమ్మడి జిల్లాలోని 54 డిగ్రీ కాలేజీలు తెరుచుకోలేదు. యాజమాన్యాల సమ్మె నేపథ్యంలో 30 వేల మందికి పైగా విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కళాశాలలు నిరవధికంగా బంద్ పాటిస్తే తమ పిల్లలు నష్టపోతారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదనకు లోనవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అంబోజి హరిప్రసాద్ తెలిపారు. భవనాలకు అద్దె, అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. నిధులు ఇవ్వక పోవడం వల్ల కళాశాలలు మూసుకునే పరిస్థితి ఉందని అసోసియేషన్ సలహాదారు మారయ్యగౌడ్ పేర్కొన్నారు.

### తెరుచుకోని కాలేజీలు..

దసరా సెలవుల తర్వాత సోమవారం పునఃప్రారంభం కావాల్సిన డిగ్రీ, పీజీ కాలేజీలు తెరుచుకోలేదు. నిజామాబాద్, బోధన్, కామారెడ్డి తదితర పట్టణాల్లో కళాశాలలను మూసి ఉంచారు. బోధన్‌లోని ఉషోదయ, ఎస్వీ, విజయసాయి కాలేజీలను మూసివేశారు. డిగ్రీ, పీజీ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదని, నిరవధిక బంద్ కొనసాగిస్తామని ఆయా కళాశాలల కరస్పాండెంట్లు సూర్యప్రకాశ్, సాయిరెడ్డి, జావీద్ తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం పలువురు మంత్రులను, అధికారులను కలిసినా ప్రయోజనం లేకపోవడంతో, బంద్ పాటించక తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజు రీ యింబర్స్‌మెంట్ , ఉపకార వేతన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.




బోధన్‌లోని కళాశాలలను బంద్‌చేసి నిరసన వ్యక్తం చేస్తున్న కళాశాలల కరెస్పాండెంట్లు, అధ్యాపకులు